


# బేరాలాడ్డం

యంబియస్ ప్రసాద్




సాధారణంగా నేను ఊహిస్తూండే స్వాప్నిక జగత్తులో (యుటోపియా లాటి దనుకోండి) బేరాలూ, సారాలూ ఉండవు. ఇంచక్కా అంతా ఫిక్సెడ్ రేట్లే (నిఝంగా ఫిక్సెడ్ రేట్లు, బోర్డులో మాత్రమే కాదు). 'బోర్డులో మాత్రమే' అని ఎందుకంటున్నానంటే, చాలాచోట్ల 'ఫిక్సెడ్ రేట్' అని బోర్డు వుంటుంది. మనం అది నమ్మేసి వస్తువు కొనుక్కొచ్చేసింతర్వాత, మన యింటి పక్కాయన అదే కొట్లో, అదే వస్తువు సగం రేటులో కొనేసి మన ప్రాణం తీయిస్తాడు—ఇంట్లో వాళ్ళచేత.

అలా అని మనమే కొట్లో "ఇంకా తక్కువ ధర కిస్తావా?" అని అడిగితే, "బేరాలుండవండీ ఇక్కడ!" అంటాడు ముక్కు గుద్దినట్లు ('ఈ మాత్రం తెలీదా' అనే వెటకారం ధ్వనిస్తుందికూడా). ఈ టాకీవాళ్ళే నయం. కొంతమంది మూకీ వాళ్ళు 'ఆఁ వీడికి చెప్పేదేమిటన్నట్లు' 'ఫిక్సెడ్ రేట్' - అన్న బోర్డుకేసి చెయ్యి చూపించి, కనుబొమ్మ లెగరేసి వూరుకొంటారు. మనం ఏం చెయ్యాలో తోచక, "ఆ బోర్డుదేముంది లెండి, బోర్డు దారి బోర్డుదే, బేరం దారి బేరందే" అని ఓ వెర్రినవ్వు నవ్వేస్తాం.

అసలు వాళ్ళు బేరం చెప్పడమే గమ్మత్తుగా వుంటుంది. ఓ రెండు అరటి పళ్ళు తినిపోదామని, బండివాడి దగ్గరకి వెళ్ళి అడిగితే వాడు డజన్ ఖరీదు చెప్తాడు— అదీ హిందీలో. దాన్ని హిందీలోంచి తెలుగులోకి తర్జుమాచేసి (నాకసలే ఢేఢ్‌కీ, ఢాఈకీ మా చెడ్డ కన్‌ఫ్యూజన్) దాన్ని పన్నెండుచేత భాగించి, రెండుచేత హెచ్చవేసి లెక్కచేసే లోపల, అప్పటికే బండివాడు "కిత్‌నా దేనా సాబ్?" అంటూనే కత్తి పళ్ళమీద పెట్టి (మన పీకమీద పెట్టినట్టే అనిపిస్తుంది) అడుగుతూంటాడు. మనం తబ్బిబ్బుపడి, లెక్కతప్పి, ఏదో రేటుకి(శ్రీ420లో రాజకపూర్లా)'ఇస్తావా?' అంటాం; వాడు తక్షణం పళ్ళిచ్చేస్తాడు. అవి తింటూ,తీరిగ్గా లెక్కేసి చూసుకొంటే వాడు చెప్పినదానికంటె ఎక్కువరేటుపెట్టి కొన్నట్టు తేలి, అరటిపండుకూడా సయించదు.

బేరం ఆడ్డంకూడా నికార్సైన కళే. అవతలవాడు బేరం చెప్పగానే ఇవతలి వాళ్ళు రెండో ఎక్కం వచ్చినవాళ్ళైతే సగానికీ, మూడో ఎక్కం వచ్చినవాళ్ళయితే మూడోవంతు రేటుకీ అడుగుతారు. ఈ ఫార్ములాకూడా చేతకానివాళ్ళ చేతిలో పనిచెయ్యదు. మా ఫ్రెండొకడు చెప్పులు




వాడు 16 రూ చెబితే, సరిగ్గా 8 రూల కడిగేడు; వా'డొక' చెప్పు చేతికిచ్చి పొమ్మన్నాడు. ఆడవాళ్ళే ఈ విషయంలోనయం. "మా ఆడపడుచు ఆ రేటుకేగా కొన్నదీ" అంటూ డబాయిస్తారు. కాని ఇటువంటి వాళ్ళు కాస్త గట్టిచర్మం మనుషులయ్యుండాలి, "ఆఁ కొన్నావులేమ్మా" అని కొట్టువాడు విదిలించేస్తున్నా వీళ్ళు బేరం సాగిస్తూనే వుండాలి.

నాకు మా ఆవిడతో షాపింగ్ కెళ్ళడం మహా భయం. పక్కనుంచి "ఇంకా తక్కువ కడగండీ, బేరం చెయ్యకపోతే వాడు టోపీ వేసేస్తాడు" అంటూ సతాయిస్తూంటుంది. నాది గట్టిచర్మం కాకపోవడం వల్ల వాడేమైనా అని పోతాడేమో నన్న భయంచేత, "మీరు ధర ఏమైనా తగ్గేందుకు అవకాశమేదైనా ఉన్నదేమో పరిశీలిస్తే మంచిదేమో" నన్న సలహా వాడి కందజేస్తాను—వాడు దాన్ని మామూలు ధోరణిలోనే రిసీవ్ చేసుకొంటాడు.

బేరం చేసేవాళ్ళు మతిమరుపు మనుషులయ్యుండకూడదు, ఓసారి మా అక్కయ్య పాతపేపర్లు కొనేవాడితో బేరమాడుతూ "వీశెలాగయ్యా?" అంది! వాడు "రూపాయి పావలా" అంటే "అంత ఎక్కువేమిటయ్యా కాస్త తగ్గించు" అంది.

రిక్షావాళ్ళతోటీ, ఆటోవాళ్ళతోటీ బేరం సరేసరి! వాళ్ళు చేరవలసిన చోటుకి సరిగ్గా రెండు ఫర్లాంగుల ముందు లెక్కెట్టుకొని అక్కణ్నుంచి సణుగుడు మొదలెడతారు. ఒకటిన్నర ఫర్లాంగు దూరంలో కోపం, ఫర్లాంగు దూరంలో బెదిరింపు, దిగేచోట కొచ్చేసరికి బేరమాడిన దానికి ఒకటిన్నర రెట్లు గుంజుకు పోతాడు.

బేరమాడ్డం జీవితంలో నిత్యావసరమై పోయింది. కూరగాయల దగ్గర్నుంచీ కట్నాలదాకా బేరం లేని చోటు లేదు. బేరమాడేటప్పుడు అబద్ధాలాడడానికి వెనుదీయకూడదు. "అదేమిటోయ్! నిన్ననేగా అయిదురూపాయలు తక్కువకితీసుకొందీ" (బట్టలు గిన్నెల విషయంలో) "కొత్తవాళ్ళకి చెప్తున్నట్లు, చెప్తున్నావే! మాదీ వూరే", "వచ్చేటప్పుడు ముప్పావలాకేగా వచ్చిందీ" (రిక్షావాళ్ళతో) లాటి అబద్ధాలు విరివిగా, ఇతోధికంగా ఆడాలి. అప్పుడే "పూజకొద్దీ పురుషుడు ..." అన్నట్లు "బేరంకొద్దీ లాభం."

అసలు 'బేరసారాలు' అన్నమాట ఎలా వచ్చిందో! బేరమాడే కెపాసిటీని బట్టి మనిషి సారం తెలిసిపోతుందనా? — కావచ్చు ... అందుకనే పెళ్ళి చూపుల టైములో అమ్మాయిని "వంటొచ్చా? తినడం వచ్చా?...." లాటి ప్రశ్నలడిగేటప్పుడు, అబ్బాయినికూడా "బేరాలాడ్డం వచ్చా? ఎంత మార్జినల్‌లో కొనగలవ్? లాటి వైవా (ఓరల్‌గా ప్రశ్నలు) వేసి, ప్రాక్టికల్‌గా ఏ కొత్తిమీరి అమ్మినో పిలిచి పది పైసలకు ఎన్ని కొత్తిమీర రెబ్బలు తీసుకురాగలవో చూద్దాం" లాటి పరీక్షలుపెట్టాలి, లేకపోతే ఎంత ప్రొఫెసర్ అయి, ఎంత




జీతం తెస్తే మాత్రం ఏం లాభం?—బేర మాడ్డం రాకపోయాక!

హైద్రాబాద్‌లో వున్నవాళ్ళకి ఇంకొక 'ఏడెడ్ (ఎట్రాక్షన్‌లా) ట్రబుల్' ఆంధ్ర ప్రాంతంనుండి బంధువులు వచ్చి హైదరాబాదునే కొనేసి పట్టుకుపోయేట్లు వచ్చి మన్ని బజారుకు రమ్మని పీక్కుతింటారు. వాడిచేత దుకాణమంతా తిరగేయించి, బోర్లేయించి "నాకా దిక్కుమాలిన హిందీవచ్చి చావదుకాని, ఆ పచ్చచీర పాతిక రూపాయల కిస్తాడేమో అడుగు" అంటారు! ఆ రేటు చెప్తే కొట్టువాడు తంతాడేమోనని మన భయం. చివరికి చెప్పుల్లో కాళ్ళుపెట్టుకొని, కొట్టు బయటనుంచోని ఆ మాట అనేసి పరిగెత్తుకొని వచ్చేయడం శ్రేయస్కరం.

అసలు ఈ దుకాణం వాళ్ళనే అనాలి. వాళ్ళే రోడ్డుమీద వెళ్తుంటే, లాక్కుపోయి వద్దు మొర్రో అంటూంటే చూపించి, రేటు అడగమని ప్రోత్సహిస్తారు. వాడు చెప్పిన రేటుకి అంత తక్కువగా మనం అడిగితే బావుండదేమోనని సంశయిస్తూంటే," పూఛియేసాబ్! పూఛ్‌నా జుర్మ్ హైక్యా?" అంటూ మభ్యపెడ్తారు. అడిగిందాకా వుండి, "ఎప్పుడైనా బట్టలు కొన్నారా? ఎవళ్ళైనా పెడితే పుచ్చుకోవడమేనా?" అంటారు.—ఇదీ వరస! ★


బాధారహిత ప్రకృతిసిద్ధమైన ఆరోగ్యము మీదే!

స్త్రీల బాధలు ప్రత్యేకమైనవి

లోధ్ర

75 సంవత్సరములకు పైగా
సుఖజీవనమునకు
లోధ్ర టానిక్‌ను
వాడిన స్త్రీలు ఎందరో!

ఉచిత వైద్య సలహాకు
ఈ క్రింద పేర్కొనబడిన విలాసమునకు
ఈ కూపన్‌ను పూర్తిచేసి మీ జాబుతో పంపండి.

పేరు: ____________

విలాసము: ____________

____________ PIN ____________




కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్ రాయపేట, మద్రాసు-14

ఏజంట్లు: శీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్ విజయవాడ — సికిందరాబాద్ — బెంగుళూరు